క్లుప్తంగా

పోషకాహార మాసోత్సవాలు



పెరవలి(వేమూరు): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిశ్రీ అన్నారు. వేమూరు మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు గురువారం రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. శాంతిశ్రీతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరోజిని మాట్లాడుతూ బాలికలు పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాగలక్ష్మి, హెల్త్ విజిటర్ శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు, కండువాలు అందజేత



పెసర్లంక(భట్టిప్రోలు): పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 66 మంది విద్యార్థులకు ఐలవరం జెడ్పీ హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ రూ.20 వేల విలువైన దుప్పట్లు, కండువాలను గురువారం అందజేశారు. 270 నోట్ పుస్తకాలు, పెన్నులు కూడా అందించారు. పెసర్లంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో పెసర్లంక, ఐలవరం హెచ్ఎంలు ఎస్కే మహబూబ్ బాషా, మాచర్ల మోహన్ రావు, ఉపాధ్యాయులు రవిరామ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సైన్యం వ్యవస్థాపక దినోత్సవం



వేమూరు: రక్షణ సైన్యం ఏర్పాటు చేసి 142 ఏళ్లయిందని మేజర్ బాబురావు తెలిపారు. మండల కేంద్రంలోని రక్షణ సైన్యం ఆలయం వద్ద గురువారం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ సెప్టెంబరు 19న రక్షణ సైన్యం ఏర్పాటైందని వివరించారు. కార్యక్రమంలో తలతోటి సువర్ణరావు, పాపరావు, దాసరి యాకోబు, మోజేష్, కె.యోహాన్, రాజకుమారి, రవి, రూబేను తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోండి



తెనాలిఅర్బన్: బీసీజీ వ్యాక్సిన్‌ను అర్హులైన ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ పేర్కొన్నారు. కొల్లిపర మండల పరిధిలోని మూడు బీసీజీ వ్యాక్సిన్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కోవిడ్ వ్యాక్సిన్ కాదని, గతం నుంచి చిన్న పిల్లలకు బీసీజీ వ్యాక్సిన్‌ను వేస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభుత్వాలు పెద్ద వారికి కూడా వేసేందుకు వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు లక్ష్మీ, మణిమ్మ, అనిత, ఎంఎల్‌హెచ్‌పీ సుష్మిత, రమ్య తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పట్టణాభివృద్ధికి కృషి



తెనాలిఅర్బన్: అధికారులు, పాలకుల సహకారంతో తెనాలి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్‌గా లక్ష్మీపతి గురువారం తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిషనర్ బండి శేషన్నను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీపతిని పలు విభాగాల మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చూస్తేనే 'షాక్'..!



బసవేశ్వర థియేటర్ ఎదురుగా ఇదీ దుస్థితి

రేపల్లె పట్టణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చూస్తేనే షాక్ కొట్టేలా ఉన్నాయి. తీగలు అస్తవ్యస్తంగా వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఫలితంగా ప్రజలు భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లపై శ్రద్ధ చూపడం లేదని పెదవి విరుస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ప్రకాశం రోడ్డులోని అంబేడ్కర్ పార్కు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. పాత స్టేట్ బ్యాంకు రోడ్డు, బసవేశ్వర థియేటర్ వెనకవైపు, బస్టాండ్ రోడ్డు, చిన్న మసీదు రోడ్డు, గరువు రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్లు కిందకు, ప్రమాదకరస్థితిలో తీగలు వేలాడుతూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేయాలని కోరుతున్నారు.

– రేపల్లె రూరల్



ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూలు వద్ద ఇలా..



చిన్నమసీదు రోడ్డులోనూ అదే పరిస్థితి



రేపల్లె అంబేడ్కర్ పార్కు సమీపంలో ఇలా..

పరిశుభ్రతతో పర్యావరణ రక్షణ



మానవహారం నిర్వహించిన విద్యార్థులు



ప్రదర్శన చేపట్టిన విద్యార్థులు

బాపట్ల: పర్యావరణం-పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సెర్ప్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ నారాయణ పేర్కొన్నారు. ఐటీసీ, సెర్ప్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ముత్తాయపాలెంలో గురువారం మానవహారం నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శరత్‌బాబు, సీఓ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

తెనాలిరూరల్: కేంద్ర సహాయ మంత్రి రణ్‌వీత్ సింగ్ బిట్టు, షిండే శివసేన ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గుంటూరు జిల్లా పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి దిష్టి బొమ్మను దహనం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ కన్వీనర్ గొరికపూడి అశోక్, దాస్, వంశీ, పవన్, షాలేము, కార్ స్టాండ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

త్రీ టౌన్‌లో ఫిర్యాదు..

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రణ్‌వీత్ సింగ్ బిట్టు, తర్వీందర్‌సింగ్ మిర్వా, రఘునాథ్ సింగ్‌లపై కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు, పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, పెనుగొండ శివకుమార్, ఎన్.మాధవరావు, రాయప్ప తదితరులు గురువారం తెనాలి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిన్నారులకు ఉచిత సంకీర్తన శిక్షణ

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేట డిపోరోడ్డుకు చెందిన శ్రీసాయిరాం సంగీత కళాశాలలో చిన్నారులకు ఉచిత గోవిందనామ సంకీర్తన శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ వఝుల లక్ష్మీసునీత గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంస్థ ఆధ్వర్యంలో 108 మంది పిల్లలకు గోవింద నామసంకీర్తన శిక్షణ ఇచ్చి, ఉచితంగా తిరుపతి తీసుకువెళ్లి, అక్కడ గోవిందనామ సంకీర్తన చేయిస్తామని తెలిపారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేయించి, తెనాలికి చేరుస్తామని వివరించారు. 8 ఏళ్ల నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలు మాత్రమే అర్హులని తెలిపారు. 9949313519, 9182551697 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పౌర్ణమి సామూహిక హారతులు



పౌర్ణమి సామూహిక హారతులలో భక్తులు

భట్టిప్రోలు: భాద్రపద శుద్ధ పౌర్ణమి సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలో రెండు రోజులుగా ఆలయాల్లో పౌర్ణమి సామూహిక హారతులు నిర్వహించారు. కోనేటిపురం రామాలయంలో జరిగిన కార్యక్రమంలో గురువారం బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ పూర్వం నుంచి పౌర్ణమికి హిందూ ధర్మంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని చెప్పారు. పౌర్ణమి నాడు ధ్యానం, సామూహిక హారతులు ఇవ్వడం వల్ల దృష్టి దోషాలు తొలగి శుభాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, అక్కల సుబ్బారెడ్డి, దండుప్రోలు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



ఉద్యానవనంలో కలుపు తీస్తున్న విద్యార్థులు

బాపట్ల: మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞానశాస్త్ర కళాశాల డీన్ సర్దార్‌బేగ్ పేర్కొన్నారు. గురువారం బాపట్ల కలెక్టరేట్‌లోని ఉద్యానవనంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో శుభ్రం చేయించారు. కలుపు తీయించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ విమల కుమారి, డాక్టర్ బ్లెస్సీ సాగర్, డాక్టర్ ఇ.గౌతమి, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



పాతనందాయపాలెంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్లపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని బాపట్ల సీడీపీఓ లక్ష్మీపార్వతి తెలిపారు. పాతనందాయపాలెం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో కల్యాణ మండపంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాలలో సీడీపీఓ ముఖ్య అతిథిగా పాల్గొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత వస్తుందని చెప్పారు. రక్తహీనత వలన కొన్ని సమయాలలో మాతా, శిశు మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పౌష్టికాహార లోపం వలన శారీరక ఎదుగుదల సక్రమంగా ఉండదని, అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, ఐసీడీఎస్ బుద్దాం సెక్టార్ సూపర్‌వైజర్ సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మన్నంగి ఆగరాజు

తెనాలిరూరల్: ఎస్సీ వర్గీకరణ విజయ సారథిగా ఈ నెల 21న మొట్ట మొదటగా తెనాలి పట్టణానికి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు గుంటూరు జిల్లాలోని మాదిగ ప్రజలు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మారిస్‌పేటలోని మేకల సురేష్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 21న మార్కెట్ యార్డులో జరిగే మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. వర్గీకరణ విజయసారథిగా వస్తున్న మంద కృష్ణ మాదిగకు మాదిగ ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు మొదటగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ చట్టబద్ధతకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్ మాదిగ, సీనియర్ నాయకులు కూచిపూడి సత్యం, మాదిగ, ఆహ్వాన కమిటీ నాయకులు మేకల సురేష్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మురికిపూడి హృదయరాజు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు కొండముది బోసుమాదిగ, తెనాలి జయ్ ప్రకాష్ మాదిగ, నియోజకవర్గ కన్వీనర్ భూదాల పవన్ మాదిగ పాల్గొన్నారు.

నేటినుంచి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు

తెనాలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు శుక్రవారం స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో జరుగుతాయని మండల కో–ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి అండర్–14, అండర్–17 విభాగాల్లోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారు. తొలిరోజున అథ్లెటిక్స్, రెండోరోజైన 21న ఆటల పోటీలు జరుగుతాయని వివరించారు. వివరాలకు 8008656217, 7780776356 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ పి.ఏడుకొండలరావు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం

అమర్తలూరు(వేమూరు) మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ షేక్ సుభాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సమావేశం ఎంపీపీ రాపర్ల నరేంద్ర అధ్యక్షతన జరుగుతుందని వివరించారు.

23 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 23, 24 తేదీలలో పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ హైస్కూలు క్రీడామైదానంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు రేపల్లె మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ వై.రాంబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 23న బాలురకు, 24న బాలికలకు ఉదయం 9 గంటల నుంచి ఆటల పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలలో పాల్గొనదలచిన విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుని అనుమతితో 21వతేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 99081 95547 నంబరును సంప్రదించాలన్నారు.

పాఠ్యాంశ ప్రణాళిక పుస్తకాల ఆవిష్కరణ

తెనాలి: పాఠశాలలకు అవసరమైన మధ్యాహ్న భోజనం, లెసన్ ప్లాన్ పుస్తకాలను (పాఠ్యాంశ ప్రణాళిక) గురువారం నాజరుపేటలోని శ్రీలలితా అండ్ కో ప్రింటింగ్, ట్రైనింగ్ బుక్స్, స్టేషనరీ ప్రధాన కార్యాలయంలో తెనాలి ఉప విద్యాశాఖాధికారిణి శాంతకుమారి ఆవిష్కరించారు. తెనాలి మండల విద్యాశాఖాధికారులు డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, వి.జయంత్‌బాబు, లలితా అండ్ కో సంస్థల అధినేత కె.సుబ్రహ్మణ్యం, కుమార్ పాల్గొన్నారు.పాఠశాలలు, కాలేజీలకు, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని పుస్తకాలను గత ఆరు దశాబ్దాలుగా తమ సంస్థ అందజేస్తోందని నిర్వాహకులు వివరించారు.

నేడు ఆదాయ పన్నుపై అవగాహన సదస్సు

తెనాలి: ది తెనాలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తెనాలిలో ఆదాయ పన్నుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని కళ్యాణమండపంలో సాయంత్రం 4.30 గంటలకు ఏర్పాటయ్యే సదస్సుకు ఛాంబర్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్ల, గౌరవ అతిథులుగా ఆదాయపన్నుశాఖ గుంటూరు 1,2 రేంజి అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఓ.ఎ న్.సుప్రియారావు, తెనాలి అదాయ పన్ను అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్ హాజరవుతారు. పట్టణానికి చెందిన వ్యాపారులు, వైద్యులు, న్యాయవాదులు, ఇతర వృత్తులవారు హాజరుకావాలని తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శులు గుండా రామకోటేశ్వరరావు, రావూరి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

భద్రతపై విద్యార్థినులకు అవగాహన

తెనాలి: ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న అరాచకాలపై పిల్లలు, తల్లులకు అవగాహన కల్పించి, తగిన జాగ్రత్తలు తీసుకొనేలా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్శిటీ కృషిచేస్తోందని ఆ యూనివర్శిటీకి చెందిన విమెన్ డెవలప్‌మెంట్ సెల్‌కు చెందిన బి.హరణి, ఎ.భానుప్రియాంక వెల్లడించారు. యూనివర్శిటీ సెల్ ఆధ్వర్యంలో 'ట్రైనింగ్ ఫర్ మదర్స్ అండ్ స్కూల్ చిల్డ్రన్ ఆన్ ది సేఫ్టీ' అవగాహన కార్యక్రమాన్ని గురువారం రూరల్ మండలం పెదరావూరులోని ఎంపీపీ-ఏబీ పాఠశాలలో విద్యార్థినులు, తల్లులకు నిర్వహించారు. సేఫ్ ప్లేస్, అన్‌సేఫ్ ప్లేస్, గుడ్, బ్యాడ్ టచ్‌పై చిత్రపూర్వకంగా అవగాహన కల్పించారు.

నీరంతా వృథా



రామలింగేశ్వర పేట పులిపాటివారి వీధిలోని రక్షిత మంచినీటి పైపులైనులో లీక్ ఏర్పడింది. దీంతో మంచినీరు వదిలిన సమయంలో పైపు నుంచి నీరు వృథాగా పోతోంది. మూడు రోజుల నుంచి ఈ పరిస్థితి కొనసాగుతోందని, పట్టించుకున్న వారు లేరంటూ స్థానికులు వాపోయారు. వాటర్ వర్క్స్ సిబ్బంది ఈ లీకుపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–తెనాలిఅర్బన్